క్లుప్తంగా

మా మద్దతు బూచేపల్లికే

● యాదవ సంఘం తీర్మానం



బూచేపల్లికి మద్దతు ప్రకటిస్తున్న యాదవులు

కురిచేడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మండల యాదవ సంఘం మద్దతు తెలిపింది. ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, మండల పార్టీ కన్వీనర్ వైవీ సుబ్బయ్య, రాష్ట్ర బీసీ సెల్ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, పడమరవీరాయపాలెం మాజీ ఎంపీటీసీ బొరిగర్ల గోవిందులు మండలంలోని అన్ని గ్రామాల యాదవ యువకులతో స్థానిక వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో గురువారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దర్శి టికెట్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కేటాయించటంతో తమ మద్దతు ఆయనకు ప్రకటించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

యర్రగొండపాలెం: స్థానిక అటవీ శాఖాధికారులు మండలంలోని వెంకటాద్రిపాలెంలో గురువారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. ఆ శాఖ కొలుకుల సెక్షన్ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయడంతో సమీపంలోని అడవుల్లో సంచరించే జంతువులకు వ్యాధులు సోకకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు సక్రూనాయక్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభానికి తరలి రావాలి

యర్రగొండపాలెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు వేలాది మంది గిరిజనులు తరలి వెళ్దామని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దేశానికే స్ఫూర్తిదాయకంగా ఏర్పాటు చేసిన ఈ స్మృతి వనం ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్క గిరిజనుడూ భాగస్వామి కావాలని ఆయన కోరారు.

దొనకొండ టీడీపీలో అసమ్మతి సెగలు

దొనకొండ: మండలంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ అసంతృప్తి చాలా రోజుల నుంచి ఉన్నా గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు పూలమాల వేసి నివాళులర్పించడంతో ఒక్కసారిగా బహిర్గతమైంది. గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు. సీనియర్ నాయకులు షేక్ మగ్బుల్, మల్లికార్జునశర్మ, రమణాయాదవ్, సుభాని, మరి కొంతమంది విడిపోయారు. స్థానికంగా ఉండే నాయకుడు, టీడీపీ అధ్యక్షుడి నాయకత్వం సరిగా లేకపోవటంతో వర్గాలుగా చీలినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

పేదలకు బియ్యం, చీరలు పంపిణీ



పేదలకు బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చీమకుర్తి: సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సంతనూతలపాడులో వంద మంది పేదలకు బియ్యం బస్తాలు, చీరలు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఎంపీడీఓ షేక్ బికారి వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె హసీనా బేగం ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బికారి సేవలను సేవాసంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకట రమణ కొనియాడారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, నారాయణస్వామి, శిఖాకొల్లి శ్రీను, మల్లారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

జగనన్న ఆశీస్సులే శ్రీరామరక్ష

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మాట్లాడుతున్న దర్శి ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాదరెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులే తమ కుటుంబానికి శ్రీరామరక్ష అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురంలో బీసీలు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో వారు బుధవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలు మాట్లాడుతూ తమ కుటుంబంపై ఉన్న నమ్మకంతో దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా జగనన్న నియమించినందుకు వారికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. జగనన్న ఆశీస్సులు, ప్రజల ఆశీస్సులతో మరోసారి ప్రజలకు సేవచేసుకునే అవకాశం దక్కిందన్నారు. ఇరవై సంవత్సరాలుగా బూచేపల్లి కుటుంబం దర్శి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు. ప్రత్యేకంగా ఉమామహేశ్వరపురంతో తమ కుటుంబానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. సాగర్ జలాల కోసం నిత్యం రైతుల పక్షాన నిలబడి వారికి అండగా నిలిచామన్నారు. గతంలో ప్రతి ఎన్నికలోనూ ఐదు వందల మెజార్టీతో తమకు అండగా నిలిచిన గ్రామస్తులు ఈసారి 700 మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలని అభిమానులను, కార్యకర్తలను, పార్టీ శ్రేయోభిలాషులను కోరారు. వైస్ ఎంపీపీలు వేముల పద్మాజానకిరామయ్య, బంకా రమణమ్మ నాగిరెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, సర్పంచ్ వేముల పద్మావతి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వరరెడ్డి, చింతల అంజిరెడ్డి, కోటిరెడ్డి, నాగూర్‌మీరావలి, ఇరుగుల కొండారెడ్డి, అబ్బని అంజిరెడ్డి, యరబ్రోలు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుజ్జుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

● నేటి విజయవాడ సభకు 40 వాహనాలు
● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మార్కాపురం: విజయవాడలో శుక్రవారం నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మార్కాపురం నియోజకవర్గం నుంచి ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. మొత్తం 20 బస్సులు, 20 కార్లలో మార్కాపురం నియోజకవర్గం నుంచి విజయవాడ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వెళ్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ దేశ చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోనుందన్నారు. అంబేడ్కర్ భావజాలానికి అనుగుణంగా పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల ఎత్తు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఒక మహా శక్తి అని ఆయన ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, సంఘ సంస్కరణలకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల నుంచి ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఆరని చిచ్చు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మస్తాన్‌వలి వర్గీయులు



నెమిలయ్య వర్గీయులు..

● వేర్వేరుగా ఎన్టీఆర్ వర్ధంతి సభలు

కురిచేడు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. ఎంతోకాలంగా రెండు గ్రూపులుగా ఏర్పడి పార్టీ కార్యక్రమాలు చేస్తున్నా ఆ మంటలు చల్లారలేదు. తాజాగా ఎన్టీ రామారావు వర్ధంతి రోజు అవి ఇంకాస్త తారాస్థాయికి చేరాయి. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి పార్టీ మండల కన్వీనర్ నెమిలయ్య, డాక్టర్ సునీల్, కాట్రాజు నాగరాజు, కిలారి కొండయ్య, కమతం నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి, బొల్లేపల్లి ఆదినారాయణ, కేసనపల్లి సువయ్య మరికొందరితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి జిల్లా సరిహద్దులోని నరసాయపాలెం పోలేరమ్మ ఆలయం వద్ద పొటేళ్లతో విందు ఏర్పాటు చేశారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మొఘల్ మస్తాన్‌వలి, గడ్డం బాలయ్య, గంధ గుర్నాథరావు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, పావులూరి కోట్లింగయ్య, కేసనపల్లి మోషేలతో కలిసి అదే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సినిమాహాలు సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద చికెన్‌తో విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు ఇరువర్గాల వద్దకు వచ్చి కార్యక్రమాల్లో పాల్గొని వెళ్లారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్ఆర్ఐ వస్తాడని, తమకు కాసుల వర్షం కురిపిస్తాడని, ఎవరికి వారు తమ బలబలాలను నిరూపించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ విషయం అధిష్టానం వద్దకు చేరినా పట్టించుకోక పోవడంతో ఇరువర్గాలు రోజురోజుకూ ప్రతిష్ఠకుపోతున్నారు. ఇరువర్గాల పోరుతో కొందరు పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వారి అనుయాయుల ద్వారా పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ద్వితీయశ్రేణి నాయకుల మధ్య సయోధ్య కుదర్చలేని అధిష్ఠానం ప్రజలను ఏమి పట్టించుకుంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పార్టీకి దర్శి సీటుపై సేన నాయకులు, తెలుగు నాయకులు ఎటూ తేల్చుకోలేని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కులగణన సర్వే పక్కాగా నిర్వహించాలి



ఎంపీడీఓ నరసింహులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన



మాట్లాడుతున్న కౌన్సిలర్ దారివేముల హర్షిత

మార్కాపురం రూరల్: కులగణన సర్వేను డోర్ టు డోర్ నిర్వహించాలని మార్కాపురం ఎంపీడీఓ తోట చందన పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం నుంచి ఈనెల 28 వరకు కులగణన సర్వేను పారదర్శకంగా నూరు శాతం నిర్వహించాలని చెప్పారు. కులగణన నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి 200 గృహాలకు క్రాస్ వెరిఫికేషన్ నోడల్ అధికారులు చేస్తారని చెప్పారు. దేశంలోనే కులగణన సర్వే చేపడుతున్న రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేను పారదర్శకంగా చేపట్టాలని 16వ బ్లాక్ కౌన్సిలర్ దారివేముల హర్షిత అన్నారు. గురువారం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో 10వ సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో సర్వే చేపట్టాలని సూచించారు.

తర్లుపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కుల గణన చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ ఎస్.నరసింహులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక యాప్‌లో ఈకేవైసీ, ఐరిష్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తారని చెప్పారు. నో కాస్ట్ కేటగిరీని కూడా కులగణన ప్రక్రియలో ఉపయోగించుకోవచ్చని చెప్పారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



విజేతలుగా నిలిచిన తంగిరాలపల్లి టీమ్ సభ్యులు



బేస్తవారిపేటలో మహిళల కబడ్డీ



అభినందనలు అందుకున్న విరాట్ జట్టు

పెద్దారవీడు: మండల పరిధిలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలను హోరాహోరీగా గురువారం నిర్వహించారు. పుచ్చకాయలపల్లి టీమ్ తంగిరాలపల్లి టీమ్ సభ్యుల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన తంగిరాలపల్లి టీమ్ సభ్యులు 8 ఓవర్లకు 82 పరుగులు చేయగా పుచ్చకాయలపల్లి టీమ్ సభ్యులు 41 పరుగులకు ఆలౌట్ కావడంతో తంగిరాలపల్లి టీమ్ సభ్యులు విజేతగా నిలిచారు. సానికవరం టీమ్ సుంకేసుల టీమ్ సభ్యుల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. సానికవరం టీమ్ సభ్యులు 8 ఓవర్లకు 58 పరుగులు చేయగా సుంకేసుల టీమ్ సభ్యులు 59 పరుగులు చేసి విజయం సాధించారు. క్రికెట్ టీమ్ సభ్యులను సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, ఆర్.పెద్దిరాజు, బాలకోటయ్యలు అభినందించారు.

రసవత్తరంగా ఆటల పోటీలు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో, నేకునాంబాద్‌లో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. బేస్తవారిపేటలో జరుగుతున్న ఆటల పోటీలను ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, ఎంపీడీఓ పార్వతి ఆటల పోటీలను పరిశీలించారు.

క్రికెట్ విజేతలకు అభినందనలు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా నాలుగు రోజులు పాటు నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ పోటీలలో గెలుపొంది మొదటి బహుమతి సాధించిన ఎస్సీ కాలనీకి చెందిన విరాట్11 టీమ్ క్రీడాకారులను పలువురు అభినందించారు. గ్రామానికి చెందిన గ్రామ గృహసారథి కోటేశ్ పర్యవేక్షణలో ఎస్సీ కాలనీలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఇళ్లూరి జీవన్‌రెడ్డి బహుమతుల దాతలు ఫ్రెండ్స్, యోగిరెడ్డి, కేశిరెడ్డి, కోటిరెడ్డిలు పాల్గొని క్రీడాకారులను అభినందించి ఆటల పోటీలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు వెంకటేష్, షాహిదుల్లా, క్రికెట్ జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్బన్ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం

కంభం: స్థానిక అర్బన్ కాలనీలో గురువారం డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభించినట్లు ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు కాలనీలో పర్యటించిన సమయంలో స్థానికులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రూ.6 లక్షలు మంజూరు చేయగా పనులను గురువారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్ర పనులను పరిశీలించారు. వార్డు మెంబర్ సద్దాం, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సమతా సంకల్ప పోస్టర్లను ఆవిష్కరించిన తాటిపర్తి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్, ఇతర నాయకులు

యర్రగొండపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాసంకల్పం ఆవిష్కరణ సందర్భంగా గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ సామాజిక సమతా సంకల్ప పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 125 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సంకల్ప యాత్రకు అన్ని వర్గాలకు చెందిన వారు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, వాగ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, ఎల్లారెడ్డి, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఆర్యవైశ్య సంఘ నాయకుడు కందూరి కాశీనాథ్ పాల్గొన్నారు.

పథకాలు వివరించేందుకే వికసిత్ భారత్



మల్లవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీకృష్ణ

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీకృష్ణ తెలిపారు. గురువారం పొదిలి మండలంలోని మల్లవరం, ఆముదాలపల్లి పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకృష్ణ

పొదిలి రూరల్: గ్రామ పంచాయతీల ఆదాయాభివృద్ధికి ప్రణాళికలే కీలకమని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2024–2025 సంవత్సరానికి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఆదాయ మార్గాలను అన్వేషించి, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పంచాయతీలకు వచ్చే నిధులతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యాలను నెరవేర్చడం కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సత్య హరిశ్చంద్ర ఉచిత నాటకం

నాగులుప్పలపాడు: అభ్యుదయవాది, విద్యావేత్త, అంబేడ్కరిస్టు శిఖా సోమయ్య మాస్టారు 5వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఉప్పుగుండూరు గ్రామంలోని బాబు జగజ్జీవన్‌రామ్ కూడలి వద్ద ఉచితంగా సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శిస్తారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పౌరాణిక నాటకాల ప్రియులు, ప్రజలు హాజరుకాగలరన్నారు.

వినుకొండలో దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ 4వ బ్రాంచిని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో సైతం వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్‌ను అభినందించారు. వినుకొండ ప్రాంతంలో ఇలాంటి వైద్యశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ కృష్ణకాంత్ విలేకరులతో మాట్లాడుతూ మా హాస్పిటల్‌లో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, సాధారణ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, అనుభవంతో కూడిన వైద్యబృందం సేవలు అందిస్తారని, ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగాలు, యాక్సిడెంట్, ట్రామా కేసులకు అనుభవజ్ఞులైన డాక్టర్లతో అత్యాధునిక వైద్యచికిత్సలు అతి తక్కువ ఖర్చుతో అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉచిత కన్సల్‌టేషన్, ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినుకొండ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు మన్నే రవీంద్ర, డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, హాస్పటల్ వైద్య బృందం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.